https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

10 AM TO 1 PM

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

98497 67747 | 9494184136

సంపుటి: 01 / సంచిక:33 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / శుక్రవారం, సెప్టెంబర్ 18,2026.

'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు టీఎంసీ'..

## ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్

- టీఎంసీ పేరు, గుర్తును తాత్కాలికంగా ఫ్రీజ్ చేసిన ఎన్నికల సంఘం
- మమతా వర్గానికి రాహుల్ గాంధీ మద్దతు
- ఈసీ, బీజేపీపై రాహుల్ తీవ్ర ఆరోపణలు
- రెండు టీఎంసీ వర్గాల మధ్య పేరు, గుర్తుపై వివాదం
- కొత్త పేర్లు, గుర్తులు ఎంచుకోవాలని ఈసీ ఆదేశం



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పేరు, ఎన్నికల గుర్తును ఎన్నికల సంఘం తాత్కాలికంగా నిలిపివేయడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ వర్గానికి మద్దతు ప్రకటించిన ఆయన.. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ప్రతిపక్ష పార్టీలను చీల్చేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. 02

## 22ఏ భూములపై సర్కార్ కీలక నిర్ణయం..

### సమస్యలకు చెక్ పెట్టేలా హైలెవల్ కమిటీ!



- ఛైర్మన్‌గా సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్
- ఇద్దరు ఉన్నతాధికారులు సభ్యులుగా నియామకం
- భూ యజమానుల విజ్ఞప్తుల పరిశీలన
- క్షేత్రస్థాయి సమస్యలపై కమిటీ దృష్టి
- పరిష్కారానికి కార్యాచరణ రూపొందించనున్న కమిటీ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

తెలంగాణలో సెక్షన్ 22-ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాకు సంబంధించి భూ యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, పెండింగ్ విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించేందుకు హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది.ముగ్గురు ఉన్నతాధికారులతో ఈ కమిటీని ఏర్పాటు చేశారు. సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్ కుమార్‌ను కమిటీ ఛైర్మన్‌గా నియమించారు. లా సెక్రటరీ పాపిరెడ్డి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు సభ్యులుగా ఉంటారు. 22-ఏ నిషేధిత భూముల జాబితాలో ఉన్న అంశాలను కమిటీ సమగ్రంగా పరిశీలించనుంది. భూ యజమానులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలు, వారి విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణను రూపొందించనుంది.ఏళ్లుగా నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్ల విషయంలో పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీపై భూ యజమానుల్లో ఆశలు నెలకొన్నాయి. సమస్యలను వేగంగా పరిశీలించి పరిష్కారం చూపే దిశగా కమిటీ పనిచేయనుంది.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ నిర్ణయాన్ని ప్రకటించగా, తాజాగా ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. 02


## నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరైన కేటీఆర్



- ఫార్ములా ఈ-రేసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్
- కోర్టుకు హాజరైన కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ మల్లేశ్వరరావు
- రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ అభ్యంతరాలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నమోదైన కేసు విచారణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా న్యాయస్థానం ముందుకు వచ్చారు.గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ఆర్థిక నిబంధనలు, ప్రామాణిక విధివిధానాలను ఉల్లంఘించి ఈ నిధులను కేటాయించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏసీబీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు, నిందితులకు ఇదివరకే సమన్లు జారీ చేసింది. గత విచారణ సమయంలో కేటీఆర్ వ్యక్తిగత కారణాల వల్ల మినహాయింపు కోరగా, విచారణ ఈనాటికి వాయిదా పడటంతో ఆయన ప్రత్యక్షంగా హాజరయ్యారు.



## ఎం.ఎస్.సుబ్బులక్ష్మి బయోపిక్.. ఎప్పుడొస్తుందో చెప్పేసిన నిర్మాత అల్లు అరవింద్!

- 2027 ఆగస్టు తర్వాత విడుదలయ్యే అవకాశం
- రష్మిక మందన్న ప్రధాన పాత్రలో నటన
- గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సినిమా
- సంగీతం అందించనున్న అనిరుధ్
- మానవీయ కోణంలో ఆమె జీవితాన్ని చూపించనున్న టీమ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న అవార్డు గ్రహీత ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవితంపై తెరకెక్కుతున్న బయోపిక్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. 02



## సీఎం విజయ్‌పై నాని ప్రశంసలు

### 'పాన్ ఇండియా' ట్యాగ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు

- విజయ్‌కి ప్రజల్లో ఉన్నది కేవలం స్టార్‌డమ్ మాత్రమే కాదన్న నాని
- తమిళ ప్రజలు విజయ్‌ను తమ ఇంటి సభ్యుడిగా చూస్తారని ప్రశంస
- ఆయన పాలన గొప్పగా సాగాలని ఆకాంక్ష

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న చిత్రం 'ది ప్యారడైజ్' ప్రచారంలో భాగంగా చెన్నైలో నిర్వహించిన ప్రెస్ మీట్‌లో నాని చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ, రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. 02

## క్రిశాంక్‌పై మరో కేసు..

### తెల్లవారుజామున 5 గంటలకే ఇంటి వద్దకు పోలీసులు



ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

బీఆర్ఎస్ నేత, మాజీ కార్పొరేషన్ చైర్మన్, ఆ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మన్నె క్రిశాంక్‌పై మరో కేసు నమోదైంది. సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకే క్రిశాంక్ నివాసం వద్ద పోలీసులు పెద్ద సంఖ్యలో మోహరించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.క్రిశాంక్ ఇంటి తలుపులు బలవంతంగా తెరిచి లోపలికి ప్రవేశించేందుకు పోలీసులు ప్రయత్నించారు. పోలీసుల రాకతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ లీగల్ సెల్ బృందం క్రిశాంక్ నివాసానికి చేరుకుంది. పార్టీ కార్యకర్తలు సైతం పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుంటుండటంతో పరిస్థితి రాజకీయంగా వేడెక్కింది. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ హోదాలో క్రియాశీలంగా వ్యవహరిస్తున్న క్రిశాంక్‌పై సోషల్ మీడియా పోస్టుల విషయంలో గతంలోనూ కేసులు నమోదయ్యాయి. తాజాగా మరో కేసు నమోదు చేయడం ద్వారా ప్రతిపక్ష నాయకుల గొంతును అణచివేసేందుకు ప్రభుత్వం పోలీసు వ్యవస్థను ఉపయోగిస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. సోషల్ మీడియా పోస్టులపై కేసులు నమోదు చేస్తూ పార్టీ నేతలను పదేపదే పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని విమర్శిస్తోంది.

విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్టును జప్తు చేయాలి..

## మీనాక్షి పై కోర్టులో మరో పిటిషన్..

హైదరాబాద్, ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18



ఏఐసీసీ తెలంగాణ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షీనటరాజన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. మీనాక్షీ నటరాజన్ ఉన్నత చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్లకుండా అడ్డుకోవాలని కో రుతూ నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలైంది. కంభం శివకుమార్‌రెడ్డి కేసులో బాధితురాలైన శ్రీలత తాజాగా నాంపల్లి కోర్టును ఆశ్రయించారు.మీనాక్షిపై ఇప్పటికే రెండు క్రిమినల్ కేసులు పెండింగ్ లో ఉన్నాయని, ఈ నేపథ్యంలో విదేశాలకు వెళ్లకుండా ఆమె పాస్‌పోర్ట్‌ను తక్షణమే జప్తు చేయాలని శ్రీలత కోర్టును అభ్యర్థించారు. శ్రీలత పెట్టిన కేసు వివరాలు ఎన్నికల అఫిడవిట్‌లో వెల్లడించని కారణంగానే గత జూన్‌లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి మీనాక్షీనటరాజన్ దాఖలుచేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఇప్పటికే మీనాక్షికి ఎంపీ పదవి దకకుండా పోగా, ఇప్పుడు విదేశీ పర్యటన విషయంలో దాఖలైన పిటిషన్ ఎలాంటి చిక్కులు తెస్తుందోననే చర్చ రాజకీయ వర్గాల్లో నడుస్తున్నది.

## డైవర్షన్ డ్రామాకింగ్ రేవంత్‌రెడ్డి..

### సమస్య వచ్చినప్పుడల్లా కేసీఆర్ మంత్రం

హనుమకొండ,ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18 :

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి మూడేండ్లు దగ్గరపడుతున్నది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇ చ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైంది. ము ఖ్యంగా లక్షలాది మంది జీవితాలతో చెలగాటమాడుతూ కోటికి పైగా ఎకరాల భూ ములను నిషేధిత జాబితా (22ఏ)లో చేర్చింది. తరాల నాటి ఆస్తులు, దశాబ్దాల కిందట కొనుగోలు చేసిన భూములను య జమానులకు కాకుండా చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా రూపొందించిన ఈ జాబితాపై రాష్ట్రం అ ట్టుడుకుతున్నది. లక్షల మంది బాధితులు పోరాటాలు చేస్తున్నారు. ప్రభు త్వ విధానం ఏమిటో అ సెంబ్లీ సమావేశాల్లో స్పష్ట త ఇస్తుందని ఆశించారు. రాత్రికి రాత్రే నిషేధం వి ధించడంపై తప్పు ఒప్పుకొని సరిచేస్తుందని, బా ధ్యులపై చర్యలు తీసుకుంటుందని అనుకున్నారు. కానీ ప్రభు త్వం మాత్రం ఎప్పటిలాగే వ్యవహరిస్తున్నది.

## జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

### వైరల్ అవుతున్న ప్రచారంపై అసలు నిజమేంటి?




బీజింగ్ :

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన మొదలైంది. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందంటూ ప్రచారం జరుగు తున్నది. 02

# కోట్లు కొల్లగొట్టా మంటున్నావు కదా

## రూ.వెయ్యి కోట్లు ఇచ్చి, మొత్తం తీసుకో': కేటీఆర్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

కేసీఆర్ ఆస్తులపై సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అసత్యప్రచారంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కేసీఆర్, ఆయన కుటుంబం లక్ష కోట్ల రూపాయల భూములు కొల్లగొట్టిందంటూ ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.వెయ్యి కోట్లు ఇస్తే తమ ఆస్తులన్నింటినీ రాసిస్తానని, మిగతా రూ.99 వేల కోట్లతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సవాలు చేశారు. ఫార్ములా ఈ–కార్ రేసు కేసుకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 'మళ్లీ రేవంత్‌రెడ్డికి నేను చెప్తా ఉన్నా. లక్ష కోట్లు అని చెప్పి నువ్వు ఏదైతే నిన్న మొన్న కేసీఆర్ కుటుంబం కొల్లగొట్టింది అని చెప్పి పేపర్లో నీకు బాకా ఊదే పేపర్లో రాయించినావో.. నేను చెప్తా ఉన్నా రేవంత్.. ఒక వెయ్యి కోట్లు మా ఆస్తులు మొత్తం నీకు ఇచ్చేస్తా. 1000 కోట్లు నువ్వు ఇయ్యి మాకు. నీకు మొత్తం మిగతా 99 వేల కోట్లతోని ఈ రాష్ట్రంలోని ఫీజు రీఇంబర్స్‌మెంట్ కట్టు. ఈ రాష్ట్రంలో నువ్వు ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుతుంది. మరి ఆ లక్ష కోట్ల వ్యవహారం ఏందో నువ్వే తెలుసుకో' అని కేటీఆర్ అన్నారు.కేసీఆర్ ఎర్రవల్లిలో భూములు కొనుగోలు చేసిన అంశాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. 'కేసీఆర్ హైదరాబాద్ నుంచి 75 కిలోమీటర్ల దూరంలో ఎర్రవల్లిలో ఎప్పుడో దాదాపు 15--20 ఏళ్ల కింద భూములు కొన్నారు. ఆ రోజు ఎంత అండి భూముల విలువ? ఒక ఎకరానికి 3 లక్షలు, 5 లక్షల రూపాయలు' అని అన్నారు. 'అంటే ఇవాళ మీరు మాట్లాడుతున్న మాటలు అక్కడ ఉన్నదెంతో లెక్క తొందరలో మీరే చెప్పారు నిన్ననే. నిన్నటి దాకా చిల్లర వాగుడు వాగి 10,000 ఎకరాలు కేసీఆర్ ఆక్రమించాడని, 1000 ఎకరాల ఫామ్‌హౌస్ అని మాట్లాడిన సన్నాసి.. అసెంబ్లీలో ఏం చెప్పినావ్? 67 ఎకరాలు అని మాట్లాడినావ్. కేసీఆర్ ఫామ్ 67 ఎకరాలు అని మాట్లాడినావ్' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'మిగతా 933 ఎకరాలు ఎక్కడున్నాయని ప్రశ్నించారు.'నేను అడుగుతున్నా రేవంత్.. మరి మిగతా 933 ఎకరాలు నీ అబ్బ ఎత్తుకపోయిండా? నీ అయ్ ఎత్తుకపోయిండా? ఎవడు ఎత్తుకపోయిండు? ఈ రోజులు వాగిన చెత్త వాగుడికి సమాధానం ఎవడు చెప్తాడు?' అని ప్రశ్నించారు. 'ముందు కేసీఆర్‌కు క్షమాపణ చెప్పు. ఆ 933 ఎకరాలు ఎక్కడ ఉందో చెప్పు. ఈ లక్ష కోట్లు ఎక్కడిదో చెప్పు. 1000 కోట్లకు మొత్తం రాసిస్తా. నువ్వు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ పెడతా' అని కేటీఆర్ సవాల్ చేశారు.'అంటే ఎంత చిల్లర ప్రచారం అంటే లక్ష కోట్లు, లక్ష కోట్లు అని కాళేశ్వరం విషయంలో ఎట్లా అయితే చిల్లర మాటలు మాట్లాడారో.. 150 బెడ్‌రూమ్లు అని ప్రగతి భవన్ విషయంలో ఎట్లా అయితే చిల్లర ప్రచారం చేశారో.. ఇవ్వాళ కూడా కేసీఆర్ మీద, ఆయన కుటుంబం మీద విషం జల్లే ప్రయత్నం చేస్తా ఉన్నారు. ఏమీ పర్వాలేదు.. అన్నీ తట్టుకుంటాం' అని అన్నారు.



మొదటిపేజీ తరువాయి

# డైవర్షన్ డ్రామాకింగ్ రేవంత్‌రెడ్డి..

## సమస్య వచ్చినప్పుడల్లా కేసీఆర్ మంత్రం

22ఏ విషయంలో దోషిగా తేలడంతో, తప్పించుకొనేందుకు దారులు వెతుకుతు న్నది. అందుకే సమస్య నుంచి తాత్కాలికంగా బయటపడేందుకు ప్రజల దృష్టిని మళ్లించే 'డైవర్షన్' విధానాన్నే నమ్ముకున్న ది. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటు న్న అతిపెద్ద సమస్యకు పరిష్కారం చూపకుండా, కేసీఆర్ కుటుంబంపై ముఖ్యమం త్రి అక్కసు వెళ్లగక్కారు. తమ భూముల సంగతేమిటని ప్రశ్నిస్తున్న వారికి జవాబు చెప్పకుండా, కేసీఆర్ కుటుంబం భూములను కొల్లగొట్టిందని అ డ్డగోలుగా ఆరోపణలు చేశారు. కేసీఆర్ కుటుంబ భూముల లెక్కలను ప్ర స్తావించారు. అయితే అవన్నీ ఎన్నికల అఫిడవిట్లలో ప్రకటించిన గణాంకాలే కావడం గమనార్హం. ప్రభుత్వాధినేతగా సమస్యకు ప రిష్కారం చూపకుండా ప్రతిపక్ష నేతపై విమర్శలు చేసి తప్పించుకోవాలని చూస్తున్నారని మండిపడుతున్నారు. పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు ఇలా పక్కదారి పట్టిస్తున్నారని, అందుకే రేవంత్‌ను 'డైవర్షన్ కింగ్' అంటారని ఎద్దేవా చేస్తున్నారు.

### అసెంబ్లీలో సమాధానం చెప్పలేక

వెయ్యిరోజుల పాలనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఎంత వ్యతిరేకత నెలకొన్నదో, బీఆర్ఎస్ నిరసనలకు వచ్చిన స్పందనతో స్పష్టమైంది. ఈ పరిస్థితుల్లో అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులను ఎదుర్కొనడం కష్టమని ప్రభుత్వం భావించినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. సభలో బీఆర్ఎస్ లేవనెత్తే అంశాలపై సమాధానం చెప్పే పరిస్థితి లేకపోవడంతో రేవంత్‌రెడ్డి ముందునుంచే డై వర్షన్ విధానాన్ని అమలుచేశారని చెప్తున్నా రు. మొదటిరోజే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గేటు బయట అడ్డుకోవడం ద్వారా డైవర్షన్ డ్రామా మొదలు పెట్టారు. మహిళా ఎమ్మెల్యేలపై వేధింపులతో మరోస్థాయికి తీసుకెళ్లారని అంటున్నారు. ఇలాంటి చర్యలతో రేవంత్ ప్రజల్లో మరింత చులకన అవుతున్నారని చెప్తున్నారు.

### ప్రతిసారి.. పక్కదారి

ప్రజల జీవితాలతో ముడిపడి ఉన్న ఒక పెద్ద అంశం తెరపైకి వచ్చి సర్కార్‌ను అతలాకుతలం చేస్తున్నప్పుడు, పరిష్కారం చూపాల్సిందిపోయి డైవర్షన్ చేయడం మొదటినుంచీ జరుగుతున్నది. గతంలో రుణమాఫీ అమలు కాక రాష్ట్రవ్యాప్తంగా రైతులు పోరాటం చే శారు. ప్రభుత్వపరం గా స్పష్టత ఇచ్చి సమస్యను పరిష్కరించాల్సిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ప్రతిపక్ష నాయకులపై ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరిట ప్రజల దృష్టిని మళ్లించారు. రైతుబంధు అమలు తీరును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా రైతులు నిరసనలు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రతి సీజనులోనూ ఇచ్చిందని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం సీజన్లకు సీజన్లు ఎగ్గొడుతున్నదంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.ఈ సమయంలో సీఎం తనదైన శైలిలో కాళేశ్వరం, కరెంటు కొనుగోళ్లపై విచారణ పేరి ట దృష్టిని మరల్చేందుకు ప్రయత్నించారు. కాంగ్రెస్ పార్టీలోని సమస్యల నుంచి తాత్కాలికంగా బయటపడేందుకు కూడా రే వంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలనే నమ్ముకుంటున్నారు. అధిష్ఠానం సైతం తీవ్ర అ సంతృప్తితో ఉన్నదట. ఇలా ప్రభుత్వంలో, పార్టీపరంగా తనపై వస్తున్న వ్యతిరేకతను తాత్కాలికంగా పక్కదారి పట్టించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ విధానాన్ని అమలు చేస్తున్నారని చెప్తున్నారు. ఇందుకు తాజా ఉదాహరణ కొండా సురేఖ ఉదం తం. కూతురు చేసిన వ్యాఖ్యలకు తల్లిని బాధ్యురాలిని చేస్తూ, బర్తరఫ్ చేశారని, త ద్వారా ప్రజల దృష్టిని విజయవంతంగా మళ్లించగలిగారని అంటున్నారు.

మొదటిపేజీ తరువాయి

# జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

చైనా డెమోక్రటిక్ పార్టీ చైర్మన్ వాంజున్ షీ చేసిన పోస్టుతోనే ఈ ప్రచారం ఊపందుకుంది. 'బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్‌కు స్వల్పంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. స్పృహ కోల్పోయిన జిన్‌పింగ్‌ను వెంటనే విమానంలో చైనాకు తీసుకొచ్చారు. స్వాగత ఏర్పాట్లు లేకుండా రహస్యంగా హెలికాప్టర్‌లో ఆర్మీ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.ఇండియాలో అయితే అందరికీ తెలుస్తుందని.. అక్కడ ప్రథమ చికిత్స చేసి తీసుకొచ్చారు. ప్రస్తుతం జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితి ఏంటో తెలియదు' అని వాంజున్ పోస్టులో తెలిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతుండగా జిన్‌పింగ్ తూలినట్టు కనిపించారు. దీంతో మోదీ ప్రసంగం ఆపి.. అంతా బాగానే ఉందా అని అడిగినట్టు సమాచారం. మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ హాజరు కాకుండానే చైనా వెళ్లిపోయారు. అప్పటి నుంచే అనుమానాలు పెరుగుతున్నాయి.

# నిజామాబాద్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో తీవ్ర విషాదం

: రివాల్వర్ మిస్‌ఫైర్ అయి ఆర్ఐ సతీశ్ మృతి
- ఉదయం విధులు ముగించుకున్న ఆర్ఐ సతీశ్
రివాల్వర్‌ను శుభ్రం చేసుకుంటున్న సమయంలో
ప్రమాదవశాత్తు పేలిన తుపాకీ- అక్కడిక్కడే మృతి చెందిన సతీశ్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18



నిజామాబాద్ జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఈ ఉదయం తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. విధులు ముగించుకుని తన సర్వీస్ రివాల్వర్‌ను శుభ్రం చేసుకుంటున్న సమయంలో ప్రమాదవశాత్తు తుపాకీ పేలడంతో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ హెచ్. సతీశ్ అక్కడికక్కడే మృతి చెందారు.పోలీసు వర్గాలు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం... ఆర్ఐ సతీశ్ తన విధులు పూర్తి చేసుకున్న అనంతరం హెడ్‌క్వార్టర్స్‌లో తన సర్వీస్ ఆయుధాన్ని శుభ్రం చేసే క్రమంలో ఈ దురదృష్టవశాత్తు ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.నిజాయతీగల అధికారిగా పేరుపొందిన ఆర్ఐ సతీశ్ మృతి చెందడంతో జిల్లా పోలీసు శాఖ తీవ్ర దిగ్భ్రాంతికి గురైంది. పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఒక్కసారిగా విషాద ఛాయలు అలముకోగా, సహచర అధికారులు, సిబ్బంది ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

# ఎన్నికల సంఘంపై రాహుల్ షాకింగ్ కామెంట్స్

'మొదట శివసేన.. తర్వాత ఎన్సీపీ.. ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్' అంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ప్రతిపక్ష పార్టీని చీల్చి, ఆ తర్వాత దాని ఎన్నికల గుర్తును లాక్కునే విధంగా ఒకే తరహా పరిణామాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. 'ఓట్ల చోరీ, ప్రభుత్వం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ కూడా' అంటూ విమర్శలు చేశారు. అయితే ఎన్నికల సంఘం మాత్రం టీఎంసీలో రెండు వర్గాలు పార్టీపై హక్కు కోరుతున్న నేపథ్యంలోనే ఈ మధ్యంతర నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మమతా బెనర్జీ వర్గం, మరో వర్గం ఇకపై 'ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' పేరు, 'ఫ్లవర్స్ అండ్ గ్రాస్' గుర్తును ఉపయోగించకూడదని ఆదేశించింది. రెండు వర్గాలు కొత్త పేర్లు, గుర్తుల నుంచి తమకు కావాల్సిన వాటిని ఎంచుకోవాలని సూచించింది. ఈ నిర్ణయం తుది తీర్పు కాదని, వివాదంపై తుది నిర్ణయం తర్వాత తీసుకోనున్నట్లు ఈసీ స్పష్టం చేసింది. అక్టోబర్ 6న నందిగ్రామ్, రెజినగర్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల నేపథ్యంలోనే ప్రస్తుత టీఎంసీ పేరు, గుర్తుపై తాత్కాలిక ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. ఇదే సమయంలో మమతా వర్గం ప్రత్యామ్నాయ పేరు, గుర్తు ఎంపికలను ఈసీకి పంపింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఈసీ నిర్ణయాన్ని తప్పుబట్టారు. టీఎంసీని బలహీనపరిచే ప్రయత్నంగా ఆయన అభివర్ణించారు. బీజేపీకి ఈసీ అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపణలు చేశారు. ఇవన్నీ కాంగ్రెస్ నేతల ఆరోపణలేనని, ఎన్నికల సంఘం మాత్రం తన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాల హక్కులను సమానంగా ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.

# మా ఆస్తులు తీసుకుని రూ. 1,000 కోట్లు ఇవ్వండి: రేవంత్ కు కేటీఆర్



- బీఆర్ఎస్ నాయకులను టార్గెట్ చేయడమే
కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్న కేటీఆర్
- హైదరాబాద్ అభివృద్ధి కోసం రాత్రంబవళ్లు ప్రయత్నించామని వెల్లడి
- కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి
ఉందని అసత్య ప్రచారం చేశారని మండిపాటు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబరు18

ఫార్ములా ఈ–రేస్ కేసులో నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టు విచారణకు హాజరైన అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టో హామీలను అమలు చేయడం వదిలేసి, బీఆర్ఎస్ నాయకులను వ్యక్తిగతంగా టార్గెట్ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యంగా మారిందని ఆయన ఆరోపించారు.కేసీఆర్ కుటుంబం రూ. లక్ష కోట్లు కొల్లగొట్టిందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ఆరోపణలను ప్రస్తావిస్తూ కేటీఆర్ ఒక సంచలన ఆఫర్ విసిరారు. "మా కుటుంబ ఆస్తులన్నింటినీ ప్రభుత్వమే తీసుకుని, దానికి ప్రతిఫలంగా మాకు రూ. వెయ్యి కోట్లు ఇస్తే ఎక్కడ సంతకం పెట్టమన్నా పెడతాను. మిగిలిన రూ. 99,000 కోట్లతో ప్రజలకు ఇచ్చిన హామీలను, సంక్షేమ పథకాలను అమలు చేయండి" అని సవాల్ చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం, పెట్టుబడులను ఆకర్షించేందుకు తాము రాత్రింబవళ్లు ప్రయత్నిస్తే, తమపై అక్రమ కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు.అలాగే భూకేటాయింపుల ఆరోపణలపై మాట్లాడుతుండగా, గతంలో కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల భూమి ఉందంటూ అసత్య ప్రచారం చేశారని, కానీ ఇటీవల అసెంబ్లీ వేదికగా రేవంత్ రెడ్డి స్వయంగా కేసీఆర్‌కు ఉన్నది కేవలం 67 ఎకరాలేనని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా బెదిరేది లేదని, న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఈ వేధింపులను ఎదుర్కొంటామని కేటీఆర్ స్పష్టం చేశారు.

మొదటిపేజీ తరువాయి

# సీఎం విజయ్‌పై నాని ప్రశంసలు

తమిళనాడు ముఖ్యమంత్రి, స్టార్ హీరో విజయ్ రాజకీయ ప్రయాణంపై స్పందించిన నాని... విజయ్‌కి ప్రజల్లో ఉన్నది కేవలం స్టార్‌డమ్ మాత్రమే కాదని, దశాబ్ద కాలంగా ఆయన సంపాదించుకున్న ప్రజల నమ్మకమని కొనియాడారు. తమిళనాడు ప్రజలు విజయ్‌ను తమ ఇంటి సభ్యుడిగా భావిస్తారని, శాసనసభలో ఆయన మాట్లాడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో చూశానని, అవి ఎంతో అద్భుతంగా ఉన్నాయని తెలిపారు. రాబోయే కాలంలో కూడా ఆయన పరిపాలన ఇలాగే కొనసాగాలని, ప్రజల నమ్మకం నిజం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఇదే సమావేశంలో 'పాన్ ఇండియా' బిరుదుపై నాని తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఒక హిందీ సినిమా ఘనవిజయం సాధిస్తే దానిని సాధారణంగా 'హిందీ సినిమా' అని మాత్రమే పిలుస్తారని, అదే దక్షిణాది సినిమాలు విజయం సాధిస్తే మాత్రం 'పాన్ ఇండియా సినిమా' అనే ప్రత్యేక లేబుల్ వేయడం తనకు నచ్చదని స్పష్టం చేశారు. తన చిత్రాలను కూడా అలా పిలవద్దని ఆయన ఆకాంక్షించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన 'ది ప్యారడైజ్' సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

మొదటిపేజీ తరువాయి

## ఎం.ఎస్.సుబ్బులక్ష్మి బయోపిక్.. ఎప్పుడొస్తుందో చెప్పేసిన నిర్మాత అల్లు అరవింద్!

'ఎంఎస్ – ఏ లెగసీ ఆన్ స్క్రీన్' పేరుతో రూపొందుతున్న ఈ సినిమా విడుదల తేదీపై నిర్మాత అల్లు అరవింద్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. వచ్చే ఏడాది ఆగస్టు తర్వాత ఎప్పుడైనా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.చెన్నైలోని మ్యూజిక్ అకాడమీలో జరిగిన సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమంలో అల్లు అరవింద్ ఈ విషయాన్ని వెల్లడించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రష్మిక మందన్న ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. అనిరుధ్ సంగీతం అందించనున్నారు. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవితాన్ని కేవలం ఓ గొప్ప గాయని కథగా కాకుండా.. ఆమె వ్యక్తిగత జీవితంలోని మానవీయ కోణాన్ని చూపించాలనుకుంటున్నట్లు దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెలిపారు. ఇందుకోసం తమ బృందం ఏడాదిగా ఆమె జీవితంపై పరిశోధన చేస్తోందని చెప్పారు.ఆమె సాధించిన భారతరత్న, ప్రపంచవ్యాప్తంగా చేసిన కచేరీలు మాత్రమే కాకుండా.. ఓ కుమార్తెగా, కళాకారిణిగా, మహిళగా ఆమె ఎదుర్కొన్న విజయాలు, వైఫల్యాలు, త్యాగాలను సినిమాలో చూపించనున్నట్లు తెలిపారు.నేటి తరం యువతకు ఆమె జీవితం ఎంతో స్ఫూర్తినిస్తుందని గౌతమ్ అన్నారు. ప్రస్తుతం లైక్స్, షేర్స్, సబ్‌స్క్రైబర్లతో విజయాన్ని కొలుస్తున్న పరిస్థితుల్లో.. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి క్రమశిక్షణ, సహనంతో జీవితకాలంలో సాధించిన గొప్పతనం యువతకు బలమైన సందేశమని పేర్కొన్నారు.

edited, Printed, Published and Owned by: Venkateshwarlu Rapolu # Flat No. 202, Nomula Chambers, E-Seva Road, TRT Seetaphalmandi, Sec'bad-61.Telangana. INDIA. www.trinetnews.com, Email: trinetnews2026@gmail.com (Telangana) Editor: Venkateshwarlu Rapolu, +91 98497 67747,9494184136